రేవంత్ తెచ్చేది గుండు సున్నానే..

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి ఎన్ని సార్లు ఢిల్లీకి వెళ్లినా.. రాష్ట్రానికి తెచ్చేది గుండు సున్నానే అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఎద్దేవా చేశారు. సీఎం 36 సార్లు కాదు.. వంద సార్లు ఢిల్లీకి వెళ్లినా ఆశ్చర్య పోనవసరం లేదని పేర్కొన్నారు. బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలి 8 మంది కార్మికులు చిక్కుకుంటే సీఎం ఎన్నికల ప్రచారంలో బిజీబిజీగా ఉన్నారని మండిపడ్డారు. ప్రమాదం జరిగి 96 గంటలు దాటిన ముఖ్యమంత్రి బాధిత కుటుంబాలకు భరోసా కల్పించలేక పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. ఓ వైపు సొరంగంలో సహాయక చర్యలు ముందుకు సాగడం లేదని, మరోవైపు రెండు రోజుల్లో ఆపరేషన్ పూర్తి చేస్తామని మంత్రులు ప్రకటించడం ఏంటని ప్రశ్నించారు. శ్రీశైలంలో అగ్ని ప్రమాదం జరిగితే విషపు రాతలతో చెలరేగిపోయిన మేధావులు ఎస్ఎల్‌బీసీ ఘటనపై ఎందుకు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్నికల ప్రచారాలు, ఢిల్లీ యాత్రలు మాని రేవంత్ రెడ్డి సొరంగంలో చిక్కుకున్న కార్మికుల కుటుంబాలకు మనోధైర్యాన్ని ఇవ్వాలని హితవు పలికారు.

సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం కొమ్మాలలో నీళ్లు లేక వదిలేసిన వరి పైరును మేస్తున్న గొర్రెలు

పచ్చని పంట పశువుల పాలు

బాషపోలు లచ్చుమయ్య.. (రైతు)

అర్వపల్లి, ఫిబ్రవరి 26 : ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు సాగు నీళ్లు లేక ఎండిపోతున్నాయి. చేసేదేమీ లేక రైతులు పశువులు, గొర్రెలు, మేకలకు మేతగా వదిలేస్తున్న దుస్థితి నెలకొంది. ఈ హృదయ విదారక దృశ్యాలు సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలంలోని పలు గ్రామాల్లో దర్శనమిస్తున్నాయి. ఎస్సారెస్పీ కాల్వ ద్వారా గోదావరి జలాలు రాకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. మండలంలో ఈ యాసంగిలో సుమారు 19 వేల ఎకరాలు నాటు పెట్టగా నీళ్లు లేక రెండు వేల ఎకరాలకు పైగా ఎండిపోయినట్టు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

నీళ్లు లేక ఐదెకరాలు ఎండింది: రైతు బాషపోలు లచ్చుమయ్య, కొమ్మాల

నాకున్న ఎనిమిది ఎకరాలు వరి సాగు చేసిన. గోదావరి నీళ్లు వస్తాయని వేస్తే నీళ్లు లేక ఐదెకరాల వరి పొలం ఎండిపోయింది. దిక్కుతోచని స్థితిలో వదిలేయడంతో చుట్టుపక్కల రైతులు, మేకలు గొర్రెలను మేపుతున్నారు. లక్షా 50 వేలకు పైగా అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టి నష్టపోయా. మిగిలిన 3ఎకరాలైనా పంట చేతికి వస్తదనే నమ్మకం లేదు. బోరు ఆగి పోస్తున్నది. రెండు రోజులకో తడి ఇస్తున్నా. దానిపై కూడా ఆశ లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్కసారి కూడా పంట ఎండిపోలేదు. కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత సాగునీటి కష్టాలు వచ్చినయి. ఎండిన పంటలను పరిశీలించి ప్రభుత్వం పరిహారం అందించాలి.

14 నెలల్లో కుప్పకూలిన 4 ప్రాజెక్టులు

- కాళేశ్వరంపై తప్పుడు విమర్శలు చేసిన కాంగ్రెస్ నేతలు దీనికి తక్షణం జవాబు చెప్పాలి
- కాళేశ్వరం కూలిందన్న మూర్ఖులకు పొలాల్లో పారుతున్న నీళ్లే సాక్ష్యం
- హైదరాబాద్‌లో కూర్చొని మాట్లాడటం కాదు...
- పల్లెల్లోకి వచ్చి గోదావరి జలాలను చూసి మేల్కోవాలి
- మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలోని కాలువకు కాళేశ్వరం నీటిని వదిలి రైతులతో కలసి సెల్ఫీ దిగుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట/హనుమకొండ, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ 14 నెలల పాలనలో రాష్ట్రంలో నాలుగు ప్రాజెక్టులు కుప్పకూలాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు దుయ్యబట్టారు. ఖమ్మం జిల్లాలో పెద్దవాగు, నల్లగొండ జిల్లాలో సుంకిశాల, పాలమూరులో వట్టెం పంప్‌హౌస్, తాజాగా ఎస్ఎల్‌బీసీలో కుప్పకూలాయని వివరించారు. 'రేవంత్‌రెడ్డీ.. కాళేశ్వరంలో ఒక్క పిల్లర్ కుంగితే బీఆర్ఎస్ తప్పు చేసిందన్నావు. మీ పాలనలో నాలుగు కుప్పకూలినయి కదా. దీనికి ఏం సమాధానం చెప్తావు?' అని సూటిగా ప్రశ్నించారు. బుధవారం ఆయన సిద్దిపేట నియోజకవర్గంలోని పలు శివాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నకోడూరు మండలం విఠలాపూర్-రంగాయిపల్లి గ్రామాల వద్ద కాలువలోకి నీళ్లు వదలారు. బుధవారం రాత్రి హనుమకొండలోని జనగామ పల్లా రాజేశ్వర్‌రెడ్డి నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయా చోట్ల హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిందంటూ ప్రచారం చేస్తున్న మూర్ఖులకు గలగలా పొలాల్లో పారుతున్న కాళేశ్వరం నీళ్లే జవాబు అని చెప్పారు. ఇక్కడ పారుతున్న నీళ్లను చూసైనా, కండ్లు తెరవాలని హితవు చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీళ్లు ఎట్లా వస్తున్నాయో ఈ ప్రాంత రైతులను అడిగితే చెప్తారని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోనో లేక గాంధీభవన్‌లోనో కూర్చొని మాట్లాడటం కాదు, పల్లెల్లోకి వచ్చి గోదావరి జలాలను చూసి మేల్కోవాలని చురకలేశారు. ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందించిన ఘనత కేసీఆర్‌దేనని, కాళేశ్వరం ప్రాజెక్టు లేకుంటే ఈ పంటలు పండేవి కావని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో గత ఐదేండ్ల నుంచి ప్రతి గుంట సాగులోకి వచ్చిందని తెలిపారు. కాళేశ్వరం నీళ్లు రావడంతో బంగారం లాంటి పంటలు పండుతున్నాయని, కేసీఆర్ కృషి వల్లే అది సాధ్యమైందని చెప్పారు. రంగనాయక్‌సాగర్, కొండపోచమ్మసాగర్, మల్లన్నసాగర్, అన్నపూర్ణ రిజర్వాయర్లు కాళేశ్వరంలో భాగం కావా? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా కుంగిపోయిన పిల్లర్‌ను బాగు చేసి, పొలాలకు సాగునీరు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పొలాల మధ్య నిలబడి మాట్లాడుతున్నా

కాళేశ్వరం దండగ కాదు, పండుగ అని రైతులందరూ చెప్తారని హరీశ్‌రావు పేర్కొన్నారు. పొలాల మధ్య నిలబడి మాట్లాడుతున్నా, ఈ నీళ్లన్నీ కాళేశ్వరం వల్లే సాధ్యమయ్యాయి, కేసీఆర్ వల్లే వచ్చాయని తెలిపారు. అంతకుముందు కరెంట్ లేదు, నీళ్లు లేవు, ఇప్పుడు రెండు పంటలు పండుతున్నాయంటే కాళేశ్వరం వల్లేనని స్పష్టంచేశారు. ఇప్పటికైనా, మరమ్మతులు చేసి చిట్టచివరి భూములకు కూడా నీళ్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎస్ఎల్‌బీసీపై సమగ్ర విచారణ చేపట్టాలి

హనుమకొండలోని మీడియాతో మాట్లాడుతున్న హరీశ్‌రావు. పక్కన ఎర్రబెల్లి దయాకర్‌రావు,పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ఎస్ఎల్‌బీసీ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని, సొరంగంలో చిక్కుకున్న కార్మికులను ఎప్పటిలోగా బయటకు తీసుకొస్తారని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఎనిమిది మంది సొరంగంలో చిక్కుకుంటే సీఎం రేవంత్‌రెడ్డి హెలికాప్టర్ వేసుకొని ఎన్నికల ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డికి రాజకీయాలు తప్ప ప్రజల ప్రాణాలు లెక్కలేదన్నారు. గురువారం ఎస్ఎల్‌బీసీ సందర్శనకు బీఆర్ఎస్ ప్రతినిధి బృందం వెళ్తుందని చెప్పారు. ఎస్ఎల్‌బీసీ ఘటనకు బీఆర్ఎస్‌కు ఏ సంబంధం ఉన్నదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తొందరపాటు, నిర్లక్ష్యంతోనే 8 మంది ప్రాణాలు మీదికి వచ్చిందని ధ్వజమెత్తారు. దీనిపై ఎన్‌డీఎస్ఏ బృందంతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు సంఘటన జరిగిన చోటుకు వెళ్లకుండా, సమీక్షించకుండా పరిస్థితి ఏమిటో చెప్పడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో రూ.3,900 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. రెండు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు నిర్మించామని తెలిపారు. సరైన సమయంలో గేట్లు తెరువకపోవడంలోనే పెద్దవాగు కొట్టుకపోయిందని చెప్పారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సోయి ఉండే మాట్లాడుతున్నాడా అని ప్రశ్నించారు. ఎస్ఎల్‌బీసీపై కాంగ్రెస్ నేతలు చిల్లర మల్లరగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలనలోనే 12 కిలోమీటర్ల టన్నెల్ తవ్వకం జరిపామని, ప్రస్తుత కాంగ్రెస్ హయాంలో కనీసం ఒక కిలోమీటర్ టన్నెల్ అయినా తవ్వారా? అని ప్రశ్నించారు. ప్రతిపక్షం అంటే ప్రభుత్వానికి భయమెందుకని నిలదీశారు. గోదావరిపై బనకచర్ల ప్రాజెక్టుకు ఏపీ ప్రభుత్వం నీళ్లు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తుంటే, తెలంగాణ ప్రభుత్వం నిద్రపోతుందా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో క్రైం రేటు పెరిగిందని, లా అండ్ ఆర్డర్ అదుపు తప్పిందని విమర్శించారు. రాజలింగమూర్తి హత్య విషయంలో ఎస్సీ ఒక మాట చెప్తుంటే, సీఎం రేవంత్‌రెడ్డి తమపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉన్నదని హరీశ్‌రావు చెప్పారు.

సీఎం రేవంత్‌కు మతిభ్రమించింది

- బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): ప్రజావ్యతిరేకతతో సీఎం రేవంత్‌రెడ్డికి మతిభ్రమించిందని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రంలో ఉప ఎన్నికలు ఎలా వస్తాయని సీఎం మాట్లాడటం హాస్యాస్పదంగా ఉన్నదని పేర్కొన్నారు. పార్టీ ఫిరాయింపులకు వ్యతిరేకంగా చట్టం చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిందని, ఆ పార్టీ ముఖ్యమంత్రిగా నేడు రేవంత్‌రెడ్డి ఇలా మాట్లాడటం విడ్డూరమని తెలిపారు. ఉప ఎన్నికలు రావంటూనే సుప్రీంకోర్టులో కౌంటర్ దాఖలు చేయడానికి సీఎం భయపడుతున్నారని, దానికోసం ఇంకెన్ని రోజులు గడువు తీసుకుంటారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, ఇప్పటికప్పుడు ఎన్నికలు వస్తే సీఎం బాగోతం బయటపడుతుందని తెలిపారు. కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలిచే చాన్స్ లేదని, ఆ భయంతోనే ప్రజల సొమ్మును తీసుకెళ్లి ఢిల్లీలో లాయర్లకు చెల్లిస్తున్నారని ఆరోపించారు.

ఆర్టీసీ సిబ్బందికి 'మహాలక్ష్మి' ఇక్కట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తేతెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ సిబ్బంది పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ పథకం అమలుకు విధి విధానాలు ఖరారు చేయకపోవడంతో డ్రైవర్లు, కండక్టర్లు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టికెట్లు తీసుకున్న పురుషులు, నెల మొత్తానికి నగదు చెల్లించి బస్ పాస్ తీసుకున్న వారు బస్సుల్లో నిల్చొని ప్రయాణిస్తూ సిబ్బందితో వివాదాలు పెట్టుకుంటున్నారు. ఉచితమే కదా అని.. ఆధార్ కార్డుతో బస్సు ఎక్కి, గమ్యస్థానం చేరకముందే మధ్యలోనే మహిళలు దిగిపోతున్నారు. దీంతో గమ్యస్థానం చేరుకునే సరికి టికెట్ తీసుకున్న మహిళలు బస్సులో లేక ఆర్టీసీ అధికారుల ప్రశ్నలతో కండక్టర్లు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య

- పంట పెట్టుబడితోపాటు కూతురు పెండ్లికి 3 లక్షల అప్పు

నర్సాపూర్,ఫిబ్రవరి 26 : మెదక్ జిల్లాలో రైతుల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చని 14 నెలల కాలంలో జిల్లాలో ఇప్పటి వరకు 70 మంది వరకు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. తాజాగా బుధవారం మరో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎవుసాన్ని నమ్ముకుని కూతురు పెండ్లికి చేసిన అప్పు తీర్చలేక చెట్టుకు ఉరివేసుకొని రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం తుజాల్‌పూర్ అర్జుతండాలో బుధవారం చోటుచేసుకున్నది. నర్సాపూర్ ఎస్సై లింగం వివరాల ప్రకారం.. అర్జుతండాకు చెందిన హలావత్ గణేశ్(42) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. పంట పెట్టుబడితో పాటు రెండేండ్ల క్రితం కూతురి పెండ్లికి అప్పు చేశాడు. ఎవుసంలో సంపాదన మాత్రం అంతంతమాత్రంగానే ఉండడంతో అప్పులు ఎలా తీర్చాలో పోలుపోక బాధపడేవాడు. ఈ క్రమంలో బుధవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు గాలించగా వ్యవసాయ పొలం వద్ద ఓ చెట్టుకు ఉరివేసుకొని కనిపించాడు. మృతుడి భార్య హలావత్ సాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింగం తెలిపారు.

నకిలీ ధ్రువపత్రాల సూత్రధారి అరెస్టు

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 26 : నకిలీ ధ్రువపత్రాల వ్యవహారంలో అసలు సూత్రధారిని పట్టుకున్నట్టు డీఎస్పీ మొగిలయ్య బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఇటీవల నకిలీ ధ్రువపత్రాలతో ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వ్యవహారంపై వ్యవసాయ ఉన్నతాధికారులు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేపట్టగా ముందుగా ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో అసలు సూత్రధారి మిర్యాలగూడకు చెందిన మాజీ ప్రిన్సిపాల్ బాలకృష్ణను రిమాండ్‌కు తరలించారు. బీసీఏ ధ్రువపత్రాలను స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ వెల్లడించారు.

మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం చింతల్‌తండాలో ఎండిపోతున్న వరి పొలంలో రైతు బానోత్ బాలాజీ. పక్కన నీరు లేని బావి

వారం విడిచి వారం కాల్వ నీళ్లు

- ఆగిఆగి పోస్తున్న బోర్లు
- పొలం పారేదెట్ల.. పండేదెట్ల?
- ఆందోళనలో రైతులు

నర్సింహులపేట, ఫిబ్రవరి 26 : మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలో ఎస్సారెస్పీ కాల్వలో నీరు వారానికి ఒకసారి వస్తుండం.. మండుతున్న ఎండలకు కాల్వ తడవడం వరకే సరిపోతున్నది. చెరువుల్లోకి సాగునీరు వచ్చే అవకాశం లేకపోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోవడం, బోర్ల నుంచి నీళ్లు ఆగిఆగి రావడం.. యాసంగికి పెట్టుబడి సాయం రైతు భరోసా అందకపోవడం, వరి పైరు కండ్ల ముందే ఎండిపోతుండంతో ఏమి చేయాలో రైతులకు అర్థం కాని పరిస్థితి నెలకొంది. వరి పైరు ఎండిపోకుండా ఉండేందుకు వేల రూపాయలు ఖర్చు చేసి బావుల్లో పూడికతోపాటు క్రేన్ సహాయంతో లోతు తవ్విస్తున్నారు. ఐదేళ్లుగా ఇలాంటి పరిస్థితి లేదని, కాల్వల్లో నీరు రావడంలేదని, పెద్ద కాల్వలో వారం వస్తే మరో వారం నీరు రాక పోవడంతో వచ్చిన నీరు చిన్న కాల్వకు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఐదేండ్లుగా ఎండిపోలే

ఐదేళ్లుగా బావి, బోరులో నీరు తగ్గిందిలేదు. పంట ఎండింది లేదు. కాల్వల్లో ఎప్పుడు చూసినా నీరు వచ్చేది. ఈ యాసంగి సాగుకు నీళ్లు ఇస్తామన్నారు. పెద్ద కాల్వలో నీరు వస్తే చిన్న కాల్వకు రావడం లేదు. పెద్ద కాల్వకు వారం విడిచి వారం నీళ్లు ఇస్తున్నారు. బోరు ఆగిఆగి పోస్తాంది. కాల్వకు నీళ్లు రావడం లేదు. వరి వేసి రెండు నెలలైంది. ఇప్పుడే పంటకు నీరు అందక ఇబ్బంది అవుతుంది. ఇంకా నెల రోజులు పంటకు నీళ్లు పెట్టుడు ఇబ్బందిగానే ఉన్నది.

-బానోతు బాలాజీ చింతల్‌తండా

రైతులపై అధికారుల దౌర్జన్యం!

- వ్యవసాయ మోటర్ల నుంచి ఫ్యూజ్‌లు, స్టార్టర్ల తొలగింపు
- ఆందోళనలో రైతన్నలు

నిజాంసాగర్, ఫిబ్రవరి 26: ఒక పక్క పంటలకు నీరందక నానా ఇబ్బందులు పడుతున్న రైతన్నలకు మరోవైపు అధికారుల వేధింపులు మొదలయ్యాయి. నిజాంసాగర్ ప్రధాన కాలువ నుంచి పొలాలకు నీరందించుకుంటున్న రైతులకు చెందిన మోటర్ల స్టార్టర్లు, ఫ్యూజ్‌లను అధికారులు తీసుకెళ్లారు. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్, బాన్సువాడ మండలాల పరిధిలోని రైతులు నిజాంసాగర్ ప్రధాన కాలువలో మోటర్లు ఏర్పాటు చేసుకొని పంట పొలాలకు నీరందిస్తున్నారు. నిజాంసాగర్ మండలం తుంకిపల్లి తండా, బాన్సువాడ మండలం జేకే తండా శివారుల్లోని మోటర్ల నుంచి స్టార్టర్స్, ఫ్యూజ్‌లను కొందరు అధికారులు ఎత్తుకెళ్లారు. మూడు గంటల కన్నా ఎక్కువగా మోటర్లను నడుపవద్దంటూ స్టార్టర్లు, ఫ్యూజ్‌లను ఎత్తుకెళ్లారని రైతులు వాపోయారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తాము ఎంతో సంతోషంగా పంటలు పడించుకున్నామని గుర్తుచేసుకుంటూ.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులను అధికారులు అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. తమకు న్యాయం చేసి తమ పంటలను కాపాడాలని వేడుకుంటున్నారు.

పండుగ పూటా కొనసాగిన ఆందోళనలు



సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్ అటవీ ప్రాంతంలో జీహెచ్ఎంసీ అధికారులు చేపట్టిన డంపింగ్‌యార్డును వెంటనే రద్దు చేయాలని గుమ్మడిదల, నల్లవల్లి, కొత్తపల్లి గ్రామస్తులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. బుధవారం గుమ్మడిదలలో మహాశివరాత్రి సందర్భంగా రైతు, మహిళా జేఏసీ నాయకులు కళశాలతో శివుడికి అభిషేకాలు చేశారు. 16వ రోజు గుమ్మడిదల మున్సిపాలిటీలో రెడ్డి సంఘం సభ్యులు రిలే దీక్ష చేపట్టారు. దీక్షకు రూ. లక్షన్నర విరాళంగా జేఏసీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డికి అందజేశారు. నల్లవల్లి, కొత్తపల్లి ప్రజలు 22వ రోజు రిలే దీక్ష చేపట్టారు. మహాశివరాత్రి సందర్భంగా బుగ్గకుంటలోని శివుడికి ఆందోళనకారులు అభిషేకాలు చేశారు. కాంగ్రెస్ సర్కారుకు, సీఎం రేవంత్‌రెడ్డికి బుద్ధి ప్రసాదిచాలంటూ శివుడికి మొక్కుకున్నారు. -గుమ్మడిదల,

బీజేపీ బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శ

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): బీసీ రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమని, గతంలో దీనికోసం ఆ పార్టీ పోరాడిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఒక ప్రకటనలో విమర్శించారు. నేడు అదే పార్టీ బీసీల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉన్నదని, ఆపార్టీకి ఆ అర్హతే లేదని తేల్చిచెప్పారు. ఇస్లాం మతం స్వీకరించిన బీసీలకు రిజర్వేషన్లు పర్తింపజేయడానికి వీలులేదని కేంద్రమంత్రి బండి సంజయ్, బీజేపీ నాయకులు వ్యాఖ్యానించడాన్ని ఖండించారు. బీజేపీ ప్రతి అంశాన్ని మతంతో జోడించడం సరైందికాదని తెలిపారు. బీజేపీ దేశవ్యాప్తంగా బీసీల హక్కులను కాలరాయడంతోపాటు, రాష్ట్రంలో బీసీల పేరుతో ముస్లిం, మైనారిటీల హక్కులను కాలరాసే వైఖరి అవలంబిస్తున్నదని మండిపడ్డారు. ప్రతి అంశాన్ని మతంతో జోడించి, మత ఘర్షణలను సృష్టించడమనేది బీజేపీకి వెన్నతో పెట్టిన విద్య అని ధ్వజమెత్తారు. సామాజిక హోదా, కులాల అణిచివేత ఆధారంగా రిజర్వేషన్లు కోరుకోవాలని, రాజ్యాంగస్ఫూర్తి కూడా అదే చెప్తున్నదని పేర్కొన్నారు.

వరి చేనుకు ట్యాంకర్‌తో నీళ్లు

- ఒక్కో ట్యాంకర్‌కు 800
- పంటను కాపాడుకునేందుకు రైతుల పాట్లు

రాయపర్తి, ఫిబ్రవరి 26 : వరంగల్ జిల్లా రాయపర్తి మండలం తెట్టకుంట తండాకు చెందిన రైతు ఇస్లావత్ యాకూబ్ పొట్ట దశకు వచ్చిన తన వరి పంటను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నాడు. రెండు ఎకరాల పొలంలో వరి పంట సాగు చేయగా, బోర్లలో చుక్క నీరు రావడం లేదు. దీంతో కండ్ల ముందే పంట చేను ఎండిపోవడాన్ని చూసి తట్టుకోలేక ఒక్కో ట్యాంకర్‌కు రూ.800 చొప్పున చెల్లిస్తూ పంటను తడుపుతున్నాడు. కాంగ్రెస్ సర్కారు తీరుతో భూగర్భజలాలు అడుగంటడంతో యాకూబ్ పడుతున్న అరిగోస రాష్ట్రంలోని అన్నదాతల దుస్థితిని కండ్లకు కడుతున్నది. ట్యాంకర్‌తో నీటిని అందిస్తూ ఇబ్బందులకు గురవుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారాయి.

వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని తెట్టకుంట తండాలో ట్యాంకర్‌తో వరి చేనుకు నీళ్లు పారిస్తున్న రైతు ఇస్లావత్ యాకూబ్

కరెంట్ కోతలపై రైతుల ఆగ్రహం

- అల్వాలపాడు సబ్‌స్టేషన్ ఎదుట బైఠాయింపు

ధరూరు, ఫిబ్రవరి 26 : యాసంగి పంటలు సాగు చేస్తున్న రైతులకు కరెంట్ కోతలు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నాయి. ఆగ్రహించిన రైతులు బుధవారం గద్వాల జిల్లా అల్వాల్‌పాడు సబ్‌స్టేషన్ ఎదుట రాయిచూర్ ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కాల్వకు నీళ్లు వదిలి, కరెంట్ తీస్తం అంటే వ్యవసాయం ఎలా చేసుకోవాలని మండిపడ్డారు. పంటలు ఎండిపోయే దశలో ఉంటే అధికారుల కాళ్లా వేళ్లా పడి నీరు విడిపించుకుంటే ఇక్కడ సబ్‌స్టేషన్‌లో కరెంట్ తీస్తే మోటర్లు ఎలా నడుస్తాయి, పంటలు ఎలా తడుస్తాయని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో నీళ్లు, కరెంట్‌కు పడిగాపులు ఉండేవీ కావు, ఈ ప్రభుత్వం ఏందో ఎప్పుడు ఏదో సమస్య తెచ్చిపెడుతున్నదని అసహనం వ్యక్తం చేశారు.

కరెంట్ కోతలను నిరసిస్తూ అల్వాలపాడులో రాయిచూర్ రోడ్డుపై బైఠాయించిన రైతులు

పండగపూట ఇంటికి చేరిన రైతు

మొదటిపేజీ తరువాయి...

రైతు రాజిరెడ్డి

అనారోగ్యంతో నారాయణరెడ్డి, బాలవ్వ దంపతులు మృతి చెందగా, వారి కొడుకు అబ్బాడి రాజిరెడ్డి వారసత్వంగా వచ్చిన భూమిని సాగు చేసుకుంటున్నాడు. తల్లిదండ్రులు కొనుగోలు చేసిన 30 గుంటలకు 2017లో పీవోటీ, సాదాబైనామా చట్టం కింద రెవెన్యూ అధికారులే పట్టాపాసుబుక్ ఇచ్చారు. ఇటీవల జిల్లా యంత్రాంగం సిరిసిల్లలో బీఆర్ఎస్ కార్యకర్తలపై కక్ష గట్టిందని ఆరోపణలున్నాయి. అందులో భాగంగానే రాజిరెడ్డి గ్రామానికే చెందిన అబ్బాడి అనిల్ అసైన్డ్ భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నాడంటూ కొందరి ఫిర్యాదు చేయగా, అబ్బాడి ఇంటిపేరుతో ఉన్న రాజిరెడ్డిని ఈ నెల 20న పోలీసులు అరెస్ట్ చేశారు. గొంతుకు వారం కిందటే ఆపరేషన్‌తో మాట్లాడలేని స్థితిలో ఉన్నప్పటికీ కనికరం లేకుండా అరెస్ట్‌చేసి రిమాండ్ తరలించారు. ఈ అన్యాయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఆయన ప్రత్యేక చొరవతో రైతు రాజిరెడ్డి న్యాయపోరాటం చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం బెయిల్ మంజూరవగా బుధవారం ఇంటికి చేరుకున్నాడు.